క్లుప్తంగా

అరసం నగర శాఖ నూతన కార్యవర్గం



ఎం.హరికిషన్, రాణిలీలావతి, ప్రమోద్ చక్రవర్తి

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కర్నూలు నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ తెలిపారు. కర్నూలులో జరిగిన అరసం నగర ప్రథమ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నగర గౌరవాధ్యక్షునిగా డాక్టర్ ఎం.హరికిషన్, అధ్యక్షులుగా రాణిలీలావతి, ప్రధాన కార్యదర్శిగా జి.వి. ప్రమోద్ చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా మీసాల రఘు, నాగరాజు, రాజా రమేష్, సహాయ కార్యదర్శులుగా చిన్న నారాయణ, డాక్టర్ కొప్పాల తిరుపతి, బోయ శేఖర్, దాసరి వెంకటరమణ, మహిళా కార్యదర్శులుగా శ్రీలతారావు, హసీనాబీ, గౌరవ సలహాదారులుగా ఎస్‌డీవీ అజీజ్, జేవీ కృష్ణయ్య, ఆదవాని హనుమంతప్ప, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీకి అరసం రాష్ట్ర శాఖ అధ్యక్ష కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, వల్లూరు శివప్రసాద్ ఆమోదం తెలిపారన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్): ఈనెల 13 వ తేదీ నిర్వహిస్తున్న పోలింగ్ విధుల్లో పనిచేయనున్న ఎన్నికల సిబ్బంది పోస్టల్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 8 వరకు స్థానిక ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

సంక్షేమ సారథి జగనన్న



ఓటు వేయాలని కోరుతున్న మాధవీలత

కల్లూరు: సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న నిలిచారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమార్తె కాటసాని మాధవీలత అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 26వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని, నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారి సంస్కృతికి ప్రతిరూపం కూచిపూడి



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు కూచిపూడి నృత్యం ప్రతిరూపమని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అన్నారు. భరత కళా గ్రామ, నాట్య వేద కూచిపూడి కళా నిలయం, టీజీవీ కళా క్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి శిక్షణ ముగింపు కార్యక్రమం కూచిపూడి నవ వసంతం పేరుతో శనివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత బెంగళూరు భరత కళా గ్రామ అధ్యక్షులు డాక్టర్ ఆర్.వసంత్ కిరణ్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, డాక్టర్ వసంత్‌కుమార్ మాట్లాడారు. శిక్షణలో పాల్గొన్న కళాకారులచే ప్రదర్శించిన కూచిపూడి నత్య అలరించింది. కేరళకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కథక్ నృత్యం ప్రత్యేకంగా నిలిచింది. అనంతరం అతిథులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాట్యాచార్యులు కె.తేజేశ్వర్, పి.రోహిత్ కుమార్, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 3.5 టీఎంసీల నీరు నిల్వ

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరదాయిని అయిన తుంగభద్ర డ్యాంలో నీరు డెడ్ స్టోరేజ్‌కు చేరింది. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో డ్యాంలో నీటి నిల్వ అడుగంటింది. డ్యాంలో శుక్రవారం నాటికి 1633 అడుగులకు గాను 1577.94 అడుగులతో 105,788 టీఎంసీలకు గాను 3.548 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో ఉండగా ఔట్‌ఫ్లో రూపంలో రాయబసవన కాలువకు 138 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



52వ వార్డులో ప్రచారం చేస్తున్న ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి



రాంబొట్ల దేవాలయం ప్రాంతంలో ప్రచారం చేస్తున్న ఇంతియాజ్ సతీమణి సమీనా

- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): కర్నూలు అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. శనివారం రాత్రి పాతబస్టాండ్‌లో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డితో కలసి ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డులో పర్యటిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. జగనన్న ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించిందన్నారు. దానికి పునాదులు వేస్తూ లోకాయుక్త మానవహక్కుల కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. దేశంలోనే రెండవ నేషనల్ లా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్ర హైకోర్టు కర్నూలులో ప్రారంభమవుతుందన్నారు.

ఇంతియాజ్‌ను గెలిపించండి

రాంబొట్ల దేవాలయం ప్రాంతంలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి సమీనా ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి, కార్పొరేటర్ సుజాత, వార్డు ఇన్‌చార్జ్ శేషయాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన భర్త ఇంతియాజ్‌ను గెలిపించాలని కోరారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



మాట్లాడుతున్న ఇంతియాజ్. పక్కన ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): ఐఏఎస్ ఆఫీసర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కర్నూలు నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. శనివారం నరసింగరావుపేటలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. 50 రోజులుగా నగరంలోని ప్రతి వార్డులో తిరిగి సమస్యలు గుర్తించానన్నారు. పరిష్కరించేందుకు తన వద్ద పక్కా ప్రణాళికలు ఉందన్నారు. పట్టణీకరణ, యువతకు ఉపాధి, మహిళలకు అదనపు ఆదాయం పెంచుకునే అవకాశాలు కల్పిస్తామన్నారు. తాగునీటి, డ్రైనేజీ, కాలుష్య సమస్యలను సమస్య పరిష్కరిస్తానన్నారు. సంక్షేమ పాలన అందించే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో చంద్రబాబు జత కట్టాడన్నారు. కూటమి మేనిఫెస్టోలో ముస్లింల రిజర్వేషన్లపై చంద్రబాబు ఎందుకు ఒక్క మాట కూడా ప్రస్తావించలేదన్నారు. జగనన్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం దివాళా తీస్తుందని విమర్శించిన చంద్రబాబే ఇప్పుడు రెండింతల సంక్షేమం ఇస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. కర్నూలు టీడీపీ అభ్యర్థి వెంట బీజేపీ జెండాలు కనబడటం లేదన్నారు. తన వెంట బీజేపీ, జనసేన నాయకులు, జెండాలు ఉంటే ఓడిపోతామనే భయంతోనే టీడీపీ అభ్యర్థి ఒంటరిగా తిరుగుతున్నాడన్నారు. కర్నూలు నియోజకవర్గంలో ప్రచారంలో వైఎస్సార్‌సీపీ దూసుకుపోతుందని, గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేస్తున్నారన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి





దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్ సాహెబ్‌ను సన్మానిస్తున్న ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి, హాజరైన ప్రజలు



మద్దతు ప్రకటించిన మొబైల్ ఓనర్స్, టెక్నీషియన్లను అభినందిస్తున్న పార్టీ నాయకులు

- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్

కర్నూలు (టౌన్): గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నూర్‌బాషా, దూదేకుల, పింజరి సంఘాలకు గౌరవమిచ్చి ప్రత్యేక స్థానాన్ని కల్పించిన జగనన్నను మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ కోరారు. శనివారం నరసింగరావు పేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంటు డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. నూర్ బాషా, దూదేకుల, పింజరి సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అహ్మద్ అలీఖాన్ సమక్షంలో భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న జగనన్నకు మద్దతు ఇవ్వాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విన్నవించారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు 1వ వార్డు కార్పొరేటర్ షాషావలి, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్ సాహెబ్, పార్టీ కోస్తాంధ్ర కన్వీనర్ షేక్ సలీం, రాయలసీమ కన్వీనర్ మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ యువజన సంఘం మద్దతు

నగరంలోని 15వ వార్డుకు చెందిన మధు, శ్రీరామ నగర్‌కు చెందిన సురేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ యువజన సంఘం సభ్యులు 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు జగనన్న భరోసాగా నిలిచారన్నారు. పేద వర్గాలకు ఉచితంగా ఉన్నత విద్య, ఇంగ్లీష్ మీడియం, మహిళలకు ఆసరా, సున్నా వడ్డీ వంటి పథకాలు అన్నీ అమలు చేసి అక్కాచెల్లెమ్మలకు అండగా నిలిచారన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

మొబైల్ షాప్ ఓనర్స్, టెక్నీషియన్ల మద్దతు

కర్నూలు నియోజకవర్గ పరిధిలోని మొబైల్ షాప్ యజమానులు, టెక్నీషియన్లు వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శనివారం పాతబస్టాండ్‌లోని హోటల్‌లో నగర మొబైల్ ఓనర్స్, టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ టెక్నీషియన్లకు తన వంతు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు



బీ.క్యాంపు బాయ్స్ హైస్కూల్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న జేసీ

కర్నూలు(సెంట్రల్): బీ.క్యాంపు బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన పాణ్యం ఫెసిలిటేషన్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శనివారం ఆమె ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాణ్యం నియోజకవర్గంలో ఇతర జిల్లాలకు సంబంధించిన వారు కాకుండా 3,926 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పీఓలు/ఏపీఓలు 1,088 మంది, ఓపీఓలు 1,506, పోలీసులు 599 మంది, అత్యవసర సేవలు కింద 250 మంది, ఇతర పోలింగ్ విధుల కింద 446 మంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మాజీ సైనికుల కేటగిరిలో 37మంది ఉన్నారన్నారు. వీరి కోసం మొత్తం 6 కౌంటర్లను ఏర్పాటు చేస్తామని, మే 6, 7, 8 తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీలు చూసుకొని పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పాణ్యంలో హోం ఓటింగ్ కోసం 159 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆమె వెంట కల్లూరు తహసీల్దార్ మునివేలు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అత్యవసర సేవల కింద పనిచేసే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఆర్వో, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి కోరారు. బుధవారం ఆయన కర్నూలులోని కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కంట్రోల్ రూమ్ సమీపంలోని టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించారు.

గర్భిణికి రక్తహీనత ఉంటే బిడ్డకు అనారోగ్యం



మాట్లాడుతున్న రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత

కర్నూలు(హాస్పిటల్): గర్భిణికి రక్తహీనత ఉంటే ఆమెకు పుట్టబోయే బిడ్డకు అనారోగ్యం ఏర్పడుతుందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. శనివారం ఆమె నిడ్జూరు గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. గర్భిణి రక్తహీనతతో ఉంటే కడుపులో పిండం సరిగ్గా ఎదగదని, ప్రసవ సమయంలో రక్తస్రావం వంటి సమస్యలు రావచ్చని చెప్పారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. కడుపులో ఎగుదుతున్న బిడ్డ తనకు కావాల్సిన రక్తాన్ని సంపూర్ణంగా తల్లి ద్వారానే పొందుతుందన్నారు. తిన్న ఆహారంలోని ఐరన్ ఒంటికి పట్టాలంటే భోజనంతో పాటు విటమిన్-సి ఎక్కువగా ఉన్న నారింజ, నిమ్మ, బత్తాయి వంటి పండ్లు తీసుకోవడం వల్ల ఆహారంలోని ఐరన్ శరీరంలోకి పూర్తిగా కలిసిపోతుందన్నారు. ఐరన్ మాత్ర తీసుకున్న గంటలోపు కాఫీ, టీ తాగకూడదన్నారు. బెల్లంతో చేసిన వంటలు, ఆకుకూరలు, పండ్లు, మాంసం, రాగులు అధికంగా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు కొబ్బరి నీళ్లు, మజ్జిగ మినహా రెడీమేడ్ పండ్ల రసాలు, శీతలపానియాలు, కాఫీ, టీలకు దూరంగా ఉండటం ఉత్తమమని చెప్పారు. డాక్టర్ విజయమాధురి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే తప్పుడు కథనాలు



బెల్లం మహేశ్వర్‌రెడ్డి

కల్లూరు: ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీకి లబ్ధి చేకూర్చేందుకే పచ్చ పత్రిక తప్పుడు కథనాలను ప్రచురిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చూస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్కు స్థలాల్లో గుడిసేలు వేసుకున్న వారికి స్థానిక నాయకులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు వేసిన గుడిసేలు అవి అన్నారు. అయితే ఇందాత జరిగింది.. అప్పటి కర్నూలు నియోజకవర్గంలో అన్నారు. కానీ 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన వల్ల కల్లూరు గ్రామీణ, కల్లూరు అర్బన్ ప్రాంతాలను పాణ్యం నియోజకవర్గంలో కలిపారన్నారు. గుడిసేలు కొట్టాలు వేసుకున్న వారికి పునరావాసం కల్పించి పార్కును ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. కాలనీ వాసులు బృందంగా ఏర్పడి ఇళ్లకు వెళ్లి ఓటేయొద్దని విజ్ఞప్తి చేస్తుండడం కూడా ఒట్టిదేనన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ వాసులతో పాటు 19వ వార్డులోని వివిధ కాలనీల ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): వేసవి అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాస్ మీడియా అధికారిణి ప్రమీలదేవి సూచించారు. శనివారం నగర శివారులోని అంబేడ్కర్‌నగర్‌లో వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఉదయం 10 గంటల్లోపు పనులు ముగించుకుని నీడ ప్రదేశానికి చేరుకోవాలన్నారు. తప్పనిసరిగా బయట ఎండలో వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి మార్చాలని, గాలి తగిలేటట్లు చూడాలని, దుస్తులు వదులు చేసి చల్లని నీటితో ముంచిన బట్టతో తరచూ శరీరాన్ని తుడవాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నీటిని/మజ్జిగను తాగించాలన్నారు. వీలైనంత త్వరగా వడదెబ్బకు గురైన వ్యక్తిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, పీహెచ్ఎన్ విజయలక్ష్మి, సీహెచ్ఓ సుమధుర, సూపర్‌వైజర్ ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త భీమేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజ, సుకన్య, ఆశా కార్యకర్త సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తే ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని బిర్లా కాంపౌండ్ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా డిఫ్తీరియా(కంఠసర్పి) పిల్లలకు ఎక్కువగా సోకుతుందన్నారు. బ్యాక్టీరియా ప్రభావంతో ఈ వ్యాధి బారిన పడిన వ్యక్తి దగ్గినప్పుడు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. తీవ్రమైన జ్వరం, గొంతునొప్పి, గొంతులో తెల్లని పొర ఏర్పడతాయన్నారు. శ్వాస తీసుకోవడంకష్టమవుతుందని, శిశువులు పాలు తాగలేరని, పిల్లలు ఆహారం తీసుకోలేరని ఇలాంటి వారిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం కింద 5 రకాల వ్యాక్సిన్లు కలిగిన పెంటా వ్యాక్సిన్‌ను ఆరు వారాలు, 10 వారాలు, 14 వారాల్లో 4 డోసులు వేస్తారన్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతము వ్యాధులు రాకుండా చేస్తాయన్నారు. 18 నెలలు, 5 ఏళ్ల వయస్సులో మరో డోసు ఇస్తారన్నారు. ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, సచివాలయాల్లో పూర్తిగా వ్యాక్సిన్లను ఉచితంగా వేస్తారన్నారు. వైద్యాధికారిణి దివ్య, డీసీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రాజ్‌నాథ్‌సింగ్ రాక

కర్నూలు కల్చరల్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం కర్నూలు జిల్లాకు రానున్నట్లు బీజేపీ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ పీటీ సాయిప్రదీప్ తెలిపారు. శనివారం ఆయ న మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజ్‌నాథ్‌సింగ్ ఆదోని ఎన్నికల సభలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఆర్ట్స్ కళాశాల మైదానం చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్‌షో ద్వారా తిక్కస్వామి దర్గా, భీమాస్, కొట్ల సర్కిల్ మీదుగా బహిరంగ సభ వేదిక చేరుకొని ప్రసంగిస్తారన్నారు.